# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 24 । ఏప్రిల్ । 2025




**మద్యం స్కాం అంటూ మాయామశ్చీంద్ర కథలు**
రాష్ట్రంలో మద్యం కుంభకోణం అంటూ కూటమి ప్రభుత్వం మాయా మశ్చీంద్ర కథలు చెబుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. -4లో



**పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ**
ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. లింగాల, చక్రాయపేట తదితర పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. -4లో



గరిష్ఠం/కనిష్ఠం
42.6/26.6

**వాతావరణం**
జిల్లాలో బుధవారం 26.6 - 42.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### ఓపెన్ ఫలితాల్లో ప్రతిభ
కడప ఎడ్యుకేషన్: ఓపెన్ పది, ఇంటర్ ఫలితాల్లో అభ్యాసకులు ప్రతిభ చాటారు. జిల్లా వ్యాప్తంగా 2135 మంది అభ్యాసకులు పరీక్ష రాయగా ఇందులో 1550 మంది ఉత్తీర్ణులు అయ్యారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి 6248 మందికిగాను 4984 మంది ఉత్తీర్ణులయ్యారని అధికారులు వెల్లడించారు.

### పులివెందుల వాసికి గిన్నిస్ బుక్‌లో చోటు



గిన్నిస్ బుక్ రికార్డు పత్రాన్ని అందుకుంటున్న రాజేష్‌కుమార్

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని రాజీవ్ కాలనీలో నివాసముంటున్న దిద్దెకుంట రాజేష్ కుమార్ గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకున్నారు. విజయవాడలోని హలెల్ మ్యుజిక్ స్కూల్ ఆన్‌లైన్ క్లాస్ ద్వారా సంగీతం నేర్చుకున్నారు. కాగా, 2024 డిసెంబర్ 1న 18 దేశాలలోని 1046 మంది స్వరాలు ఆలపించినవారిలో ఈయన ఒకడు. రాజేష్‌కుమార్ ఈ రికార్డును సొంతం చేసుకున్నందుకు పులివెందుల పాస్టర్ అసోసియేషన్ సభ్యులు, ఎర్రబల్లి కొత్త పల్లి ఇమ్మనుయేలు, చర్చి పాస్టర్ సిమోను, వైవీయూ లలిత కళల విభాగం అకడమిక్ ఇన్‌ఛార్జి శేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు హర్షం వ్యక్తం చేశారు.

### ప్రారంభమైన హేలాంబ తిరునాల



కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ ఎల్లమ్మ(హేలాంబ) తిరునాల మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. బుధవారం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రవీంద్ర ఆధ్వర్యంలో, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో తిరునాల మహోత్సవా లు ప్రారంభం అయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణలతో బాజా భజంత్రీల నడుమ, భక్తుల సమక్షంలో ఎల్లమ్మను ప్రతిష్ఠించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టా రు. ప్రముఖ రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత సుబ్బరాయుడు తన బృందంతో కల సి చెప్పిన ఎల్లమ్మ కథ భక్తులను ఆకట్టుకుంది.

## పది ఫలితాలు..
# వైఎస్సార్ జిల్లా @ 18



అతికారి పల్లవి (594), సిద్దవటం



నాగవీర తరుణ్ (593), పెండ్లిమర్రి



రామ్ సాయి విఘ్నేష్ (593), కాశినాయన

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి ఫలితాల్లో వైఎస్సార్ జిల్లా వెనకబడింది. రాష్ట్రవ్యాప్తంగా 18వ స్థానంలో నిలిచింది. గతేడాది రాష్ట్రంలో వైఎస్సార్‌జిల్లా మూడవస్థానంలో నిలువగా ఈ ఏడాది 15 స్థానాల దిగువకు పడిపోయింది. దీంతోపాటు ఉత్తీర్ణతశాతం కూడా బాగా తగ్గింది. గతేడాది 92.10 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 80.78 శాతానికి పరిమితమైంది. మొత్తంపై 11.32 శాతం ఉత్తీర్ణత తగ్గింది. విద్యార్థుల చదువుల కోసం గత వైఎ స్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించింది. కూటమి ప్రభుత్వంలో పాఠశాలల పర్యవేక్షణ కొరవడి ఫలితాల పరంగా వెనుకబడినట్లు చర్చ సాగుతోంది.



ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి 595 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన సింహాద్రిపురం రావులకొలను జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పల్లెటి జోషికను సన్మానిస్తున్న హెచ్‌ఎం సిబ్బంది

• జిల్లావ్యాప్తంగా 161 పరీక్షా కేంద్రాలలో పది పరీక్షలు జరిగాయి. 27680 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 22361 మంది పాసై 80.78 ఉత్తీర్ణత సాధించారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ 92.77 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో తొలిస్థానంలో నిలువగా బీసీ వెల్ఫేర్ 91.02 తో ద్వితీయ, ఏపీ ట్రైబర్ వెల్ఫేర్ 86.42 శాతంతో తృతీయస్థానంలో నిలిచాయి.

• జిల్లావ్యాప్తంగా 14332 మంది బాలురకుగాను 11189 మంది, 13402 మంది బాలికలకుగాను 11172 మంది పాసయ్యారు. ఈ ఏడాది కూడా బాలురపైన బాలికలదే పై చేయిగా నిలిచింది. మొత్తంపై 22,361 మంది ఉత్తీర్ణత సాధించగా.. వీరిలో 18641 మంది విద్యార్థులు ప్రథమస్థానంలో, 2699 ద్వితీయ స్థానంలో, 1021 మంది తృతీయస్థానంలో నిలిచారు.

**3** గతేడాది జిల్లా స్థానం
**18** ఈ ఏడాది జిల్లా స్థానం
**27,680** పరీక్ష రాసిన విద్యార్థుల సంఖ్య
**22,361** ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య
**80.78** ఉత్తీర్ణత శాతం
**78.37** బాలుర ఉత్తీర్ణత శాతం
**18,641** ప్రథమస్థానంలో ఉత్తీర్ణులైన వారి సంఖ్య
**83.36** బాలికల ఉత్తీర్ణత శాతం

**మేనేజ్‌మెంట్ వారీగా ఉత్తీర్ణతశాతం ఇలా...**

| మేనేజ్‌మెంట్ | పరీక్షలు రాసినవారు | పాస్ | ఉత్తీర్ణతశాతం |
|---|---|---|---|
| ఎయిడెడ్ | 643 | 415 | 64.54 |
| బీసీవెల్ఫేర్ | 256 | 233 | 90.02 |
| ప్రభుత్వ | 654 | 421 | 64.37 |
| కేజీబీవీ | 620 | 533 | 85.97 |
| మున్సిపాలిటీ | 1732 | 1172 | 67.67 |
| మోడల్‌స్కూల్స్ | 258 | 219 | 84.88 |
| ఏపీ రెసిడెన్షియల్ | 166 | 154 | 92.77 |
| సోషియల్ వెల్ఫేర్ | 827 | 646 | 78.11 |
| ట్రిబల్ వెల్ఫేర్ | 81 | 70 | 86.42 |
| జెడ్పీ, ఎంపీపీ | 9002 | 5988 | 66.52 |
| ప్రైవేటు | 13441 | 12510 | 93.07 |
| మొత్తం | 27680 | 22361 | 80.78 |

**ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్స్ వీరే...**

| విద్యార్థి | మేనేజ్‌మెంట్ | మండలం | మార్కులు |
|---|---|---|---|
| పల్లెటి జోషిక | జెడ్పీ | సింహాద్రిపురం | 595 |
| అతికారి పల్లవి | జెడ్పీ | సిద్దవటం | 594 |
| బి.రామసాయి విఘ్నేష్ | ఏపీఎంఎస్ | కాశినాయన | 593 |
| నీలం నాగవీరతరుణ్ | జెడ్పీ | పెండ్లిమర్రి, గంగనపల్లి | 593 |
| రుద్రగంగ జశ్వంత్‌రెడ్డి | జెడ్పీ | వేంపల్లి, రామిరెడ్డిపల్లె | 592 |
| అతికారి దీక్షిత | జెడ్పీ | బద్వేల్ | 591 |
| జి.వెంకట శివ సంతోష్ | ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ | జమ్మలమడుగు | 591 |
| జడ కార్తిక్ | జెడ్పీ | వేముల | 590 |
| కొట్టంజువేరియా తహిషీన్ | జెడ్పీ | జమ్మలముడగు | 590 |
| గంజికుంట తన్మయి | ఎంజేపీ బీసీ వెల్ఫేర్ గర్ల్స్ | పులివెందుల | 589 |

**ఫలితాలు సంతృప్తినిచ్చాయి**



జిల్లాలో ప్రస్తుతం వచ్చిన పదో తరగతి ఫలితాలు సంతృప్తినిచ్చాయి. సింహాద్రిపుర మండలం రావులకొలను జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జోషిక్ష 595 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల టాపర్‌గా ప్రథమ స్థానంలో నిలిచింది. సిద్దవటం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పల్లవి 594 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. చాలా మంది గ్రామీణ విద్యార్థులు 500 మార్కులు పైనే సాధించారు. ప్రైవేటు విద్యార్థులకంటే మా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. – షేక్ షంషుద్దీన్, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

### డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి
కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రొద్దుటూరు రూరల్: ప్రొద్దుటూరులో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, ప్రధానమైన డ్రైనేజీ కాలువల సమస్యకు శాశ్వత పరి ష్కారం చూపుతామని కలెక్టర్ శ్రీధర్ తెలిపా రు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఆయన నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారులతో అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రొద్దుటూరు నుంచి మురికి నీరు వెళ్లే కాలువల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. ఆక్రమణల తొలగింపులో ఎవరైనా పేదలు నష్టపోతే వారికి ఇళ్లస్థలాలను మంజూరు చేయా లని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధి నుంచి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన మడూరు కాలువ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కాలువల ఆధునీకరణకు నిధులు లేకపోతే విడతల వారిగా పూర్తి చేయలని సూచించారు. కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అందుకు సంబంధించిన గతంలో మంజూరైన నిధులు, ప్రస్తుతం అవసరమైన నిధుల ప్రతిపాదనలు తెలపాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతి కట్టడానికి బిల్డింగ్ పర్మిషన్ తీసుకునేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. హౌసింగ్ పథకం కింద పేదలకు మంజూరైన ఇళ్లు, టిడ్కో గృహసముదాయాల పరిస్థితిపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. వాణిజ్యపరంగా పేరున్న ప్రొద్దుటూరులో గ్యాంబ్లింగ్, బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలను, గంజాయి అమ్మకాలను సమూలంగా నిర్మూలించేందుకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం పారదర్శకంగా పనిచేయాలన్నారు. అటవీ భూములు, పెన్నా ఏటి పోరంబోకు స్థలాల్లో నిర్మించిన అక్రమ భవనాలపై త్వరలో ప్రభుత్వ ద్వారా ఒక కమిటీ వేస్తామన్నారు. ఆర్డీఓ సాయి శ్రీ, తహసీల్దార్ గంగయ్య పాల్గొన్నారు.

## శభాష్.. కీర్తిరెడ్డి
భర్త ప్రోత్సాహంతో సివిల్స్‌లో 316వ ర్యాంకు

కడప ఎడ్యుకేషన్: ఆమె సాధించిన ఈ విజయం మహిళలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ఎంత పెద్ద లక్ష్యమైనా చేరుకోవచ్చునని ఆమె విజయం తెలియజేస్తోంది. ఆమె పేరే శ్రీనివాస కీర్తిరెడ్డి. కడప నగరానికి చెందిన ఈమె భర్త ప్రోత్సాహంతో సివిల్స్ ఫలితాల్లో 316 ర్యాంకు సాధించింది. కీర్తిరెడ్డి భర్త ఎం పాటి శ్రీసాయి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌లో భాగంగా విజయవాడలోని ఆల్ ఇండియా రేడియోలో న్యూస్ ఏపీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా భర్త ప్రోత్సాహంతో పాటు ఆయన గైడెన్స్‌తోనే కీర్తిరెడ్డి సివిల్స్‌కు ఇంటి వద్దే నుంచే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 316వ ర్యాంకు సాధించింది. కీర్తిరెడ్డి తండ్రి



తల్లిదండ్రులు, భర్తతో కీర్తిరెడ్డి

కేవీ చలమారెడ్డి కడపలోని ఎల్ఐసీలో అడ్మినిస్టేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చెందారు. తల్లి శ్రీకృష్ణ ఎల్ఐసీలో హైయర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కీర్తిరెడ్డి ప్రాథమిక విద్య రాజంపేటలోని నలంద హైస్కూల్లో పూర్తి చేయగా ఇంటర్మీడియట్‌ను హైదరాబాదులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో , ఇంజనీరింగ్ రాజస్తాన్‌లోని బిట్స్‌పిలానీలో పూర్తి చేశారు. కీర్తిరెడ్డికి ర్యాంకు రావడంపై బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

## ‘చింతమనేని’పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
జేసీకి జర్నలిస్టుల వినతి

కడప సెవెన్‌రోడ్స్: ఏలూరు సాక్షి దినపత్రిక కార్యాలయంపై దాడికి పాల్పడ్డ టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెన్ను శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని తొలినుంచి క్రిమినల్ చరిత్ర ఉన్న వ్యక్తి అని, అలాంటి వారిని అందలమెక్కిస్తే రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలే చోటుచేసుకుంటాయన్నారు. ఎమ్మెల్యే, అతని



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

అనుచరవర్గం సాక్షి కార్యాలయంపై దాడి చేసి కంప్యూటర్లు ధ్వంసం చేయడమే కాకుండా విధి నిర్వహణలో ఉన్న విలేకరిపై దాడి చేయడం దారుణమన్నారు. సాక్షి పత్రికలో తమకు వ్యతిరేకంగా వార్త వచ్చిందని దాడి చేయడం దుర్మార్గమన్నారు. పత్రికలో వచ్చిన వార్తలో వాస్తవాలు లేకపోతే వివరణ ఇవ్వాలేగానీ కార్యాలయాలపై, విలేకరులపై దాడులు చేయడం అప్రజాస్వామికమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉందన్నారు. చంద్రబాబు వెంటనే స్పందించి చింతమనేనిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఆయనపై చట్టపరమైన చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దిశ బ్యూరో ఇన్‌ఛార్జి మన్యం శివరాం, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్టర్ నాగరాజు, సాక్షితో పాటు వివిధ మీడియా సంస్థల జర్నలిస్టులు విలియమ్స్, ప్రసాద్, ఆనంద్, భూమిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, రవికుమార్, ఫణి, కిషోర్, యల్లారెడ్డి, జయరాజు, దుర్గా ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వేంపల్లె : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని జీవాల మార్కెట్ సందులో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఉదయం నుంచి తోపుడు బండిపై పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### మద్యం తాగి వాహనం నడిపినందుకు జరిమానా

బద్వేలు అర్బన్ : రోడ్డు ప్రమాద నియంత్రణలో భాగంగా పట్టణ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు విస్తృతం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం వారిని బద్వేలు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ముకేష్ కుమార్ ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని, ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరుస్తామని తెలిపారు.

### వంద బియ్యం బస్తాలు పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఎర్రగుంట్ల పట్టణంలోని రాణివనం కాలనీలో ఓ గదిలో నిల్వ ఉంచిన 100 ప్రభుత్వ బియ్యం బస్తాలను పట్టుకున్నట్లు కడప విజిలెన్స్ శాఖ సీఐ శివన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఎర్రగుంట్ల పట్టణంలో పలు చోట్ల బియ్యాన్ని కిలో రూ.18లకు కొనుగోలు చేసి వాటిని రాణీవనంలోని ఒక గదిని అద్దెకు తీసుకుని అందులో భద్రపరిచారన్నారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి నిల్వ ఉంచిన 100 ప్రభుత్వ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని వీరకుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న బియ్యం బస్తాలను సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ గోవింద్‌కు అప్పగించామన్నారు. ఈ దాడిలో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం స్కాం అంటూ
# మాయామశ్చీంద్ర కథలు

**వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో మద్యం కుంభకోణం అంటూ కూటమి ప్రభుత్వం మాయా మశ్చీంద్ర కథలు చెబుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైజాగ్‌లో ఉర్సా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కూటమి ప్రభుత్వం 60 ఎకరాలు కట్టబెట్టిందన్నారు. ఐటీ పార్కులో డేటా సెంటర్ పేరుతో 3.50 ఎకరాలు కట్టబెట్టారన్నారు. రూ.3200 కోట్లు విలువ జేసే భూమిని అడ్రస్ లేని టీడీపీ బినామీ షెల్ కంపెనీకి ధారాదత్తం చేయడం దారుణమన్నారు. దీన్నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మద్యం స్కాంను తెరపైకి తెచ్చారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ పారదర్శకంగా జరిగిందన్నారు. దశల వారీగా మద్య నిషేధం చేయాలని, రాష్ట్రంలో 50 వేల బెల్టు షాపులు, 4వేల పర్మిట్ రూములను రద్దు చేశారన్నారు. మద్యం ధరలు ఎక్కువగా ఉంటే దాన్ని కొనే వారు తగ్గుముఖం పడతారని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భావించారన్నారు. ప్రైవేటు పరిధిలో ఉన్న మద్యం దుకాణాలను ప్రభుత్వ పరిధిలోకి తెచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పించారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం లేనిది ఉన్నట్లు సృష్టించి ఏవేవో కేసులు పెట్టి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన వాసుదేవరెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టి తప్పుడు వాంగ్మూలం ద్వారా రాజ్‌కసిరెడ్డిని అరెస్ట్ చేయించారన్నారు. సంబంధం లేని సెక్షన్లు ఉన్న ఈ కేసు చూసి న్యాయమూర్తి కూడా నివ్వెరపోయారన్నారు. 2014–19లో టీడీపీ ప్రభుత్వంలో ఎంఆర్‌పీ ధరల కంటే 20 శాతానికి ఎక్కువ వసూలు చేసేలా ఉత్తర్వులిచ్చి రూ.1255 కోట్లు దోచుకున్నారన్నారు. ఆ ఎమద్యం స్కాం పై సీఐడీ కేసు కూడా నమోదు చేసిందని, అప్పటి మంత్రి కొల్లు రవీంద్రతో పాటు చంద్రబాబు పై కూడా కేసు నమోదైందని గుర్తు చేశారు. కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే వైఎస్ జగన్ చుట్టూ ఉన్నవారందరిపై కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తప్పుడు ఆరోపణలతో వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రాబోయే రోజుల్లో తప్పనిసరిగా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, పులి సునీల్ కుమార్, సీహెచ్ వినోద్, మునిశేఖర్ రెడ్డి, షఫీ, దానమయ్య పాల్గొన్నారు.

## పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపందల చర్య

**కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి.రాఘవరెడ్డి**

కడప అర్బన్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య అని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి.రాఘవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రాణం విలువ తెలియని కిరాతక హంతకుల దుష్ట చర్యలను సమస్త సమాజం ఖండించాలని ఆయన పిలుపు నిచ్చారు. మానవత్వం ఉన్న వారెవరు ఇలాంటి చర్యలకు పాల్పడరన్నారు. ఉగ్ర మూకలను తుదముట్టించాలని కోరారు.

**అమాయకులను చంపడం సిగ్గుమాలిన చర్య**

కడప కోటిరెడ్డిసర్కిల్ : కశ్మీర్ సైనిక దుస్తుల్లో వచ్చి పర్యాటకులపై మారణహోమం సృష్టించిన తీరు దురదృష్టకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కశ్మీర్ ఉగ్రదాడిపై యావత్తు ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయని పాకిస్తాన్, ఉగ్రవాద సంస్థ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

### చీటింగ్ కేసు నమోదు

కొండాపురం : మండల పరిధిలోని ఎస్. తిమ్మాపురం గ్రామానికి చెందిన రామాంజనమ్మ పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యు. ప్రతాప్ రెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఓబన్నపేట గ్రామంలోని దేరా జ్యోతికి పట్టు చీరలు ఇప్పిస్తానని సుమారు లక్ష రూపాయలు డబ్బులు తీసుకొని పట్టుచీరలు ఇవ్వకపోవడంతో రామాంజనమ్మతో పాటు ఆమె కొడుకు మోసం చేశారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

### మట్కా బీటర్ అరెస్టు

రాజుపాళెం : మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన గాంతి హరిబాబు అనే వ్యక్తి మట్కా రాస్తున్నాడని సమాచారం రావడంతో అతన్ని పట్టుకున్నట్టు ఎస్ఐ కత్తి వెంకటరమణ బుధవారం తెలిపారు. అతని వద్ద నుంచి మూడు మట్కా స్లిప్‌లతో పాటు రూ.10,890 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### రెండు మట్టి టిప్పర్లు పట్టివేత

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలో ఎగువ చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం సాయంత్రం ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సీజ్ చేశారు. సీజ్ చేసిన టిప్పర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

### 10 మంది జూదరుల అరెస్టు

జమ్మలమడుగు రూరల్ : జూదమాడుతున్న 10 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 27 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఎస్. లింగప్ప తెలిపారు. కోవెలకుంట్ల రోడ్డులో ఉన్న మైలవరం కెనాల్ వద్ద జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది దాడి నిర్వహించారన్నారు.

## మట్టి తవ్వకాలను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు



మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లె ప్రాంతంలో బుధవారం మైనింగ్ శాఖ విజిలెన్స్ అధికారులు మట్టి తవ్వకాలను పరిశీలించారు. గడ్డమాయపల్లె సమీపంలో సర్వే నంబర్ 83లోని ప్రభుత్వ భూముల్లో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ అనుమతి లేకున్నా తవ్వకాలు జరుపుతున్నారని గ్రామానికి చెందిన తప్పెట శశిధర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు మట్టి తవ్వకాలను పరిశీలించారు. అనుమతి లేనట్లు తేలితే చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

## న్యాయవాది ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న చిన్నచౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓంశాంతినగర్ రోడ్ నంబర్ 20లో నివాసం ఉంటున్న నీలిమ అనే న్యాయవాది ఇంటిలో దొంగలు బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారు. న్యాయవాది గతనెల 21న తన పుట్టింటికి వెళ్లారు. ఈనెల 22వ తేదీన రాత్రి తమ ఇంటికి రాగానే వాకిలి తెరిచి ఉండటం, బీరువాలను పగులగొట్టి బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారు. సంఘటన స్థలాన్ని మంగళవారం రాత్రి చిన్నచౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పోలీసులు తమ విచారణలో 9 తులాల బంగారు ఆభరణాలు దోచుకుని వెళ్లినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా న్యాయవాది నీలిమ తమ ఇంటిలో సుమారు 1000 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## పెద్దముడియం డీటీ, ఆర్ఐలపై చర్య తీసుకోవాలి



జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఒకరి భూమి మరొకరి పేరిట మార్చడం ద్వారా అక్రమాలకు పాల్పడిన పెద్దముడియం డిప్యూటీ తహసీల్దార్ గొసియాబేగం, ఆర్ఐ భువనేశ్వరిపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి బుధవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను కోరారు. వీరిరువురూ దీర్ఘకాలంగా పెద్దముడియంలో పనిచేస్తూ అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ మండలంలోని కొండపాపయ్యపల్లెకు చెందిన పి.గౌరీదేవికి దిగువ కల్వటాల గ్రామంలో వారసత్వంగా వచ్చిన 40 ఎకరాల భూమిని ఇతరుల పేరుతో రికార్డుల్లోకి ఎక్కించి ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. సర్వే నెంబర్లకు «పి» అనే అక్షరాన్ని చేర్చి సర్వే నెంబరు 691/1పీలో గిరిధర్‌రెడ్డి, సుబ్బయ్య అనే వ్యక్తుల పేర్లతో, అలాగే సర్వే నెంబర్లు 722, 692/1లోని భూమిని మునగల భాస్కర్‌రెడ్డి, సతీష్ కుమార్‌రెడ్డి పేర్లతో సర్వేనెంబరు 691/3లోని భూమి పుణ్యావతమ్మ పేర్లతో ఆన్‌లైన్ చేశారని పేర్కొన్నారు. ఈ అంశంపై పలుమార్లు బాధితురాలు గౌరీదేవి విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదన్నారు. విచారణ చేపట్టి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, బాధితురాలు గౌరీదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులు, క్రిష్టియన్ మైనార్టీలపై జరిగే
# దాడులను ఎదుర్కోవాలి

**వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : దళితులు, క్రిష్టియన్ మైనార్టీలపై జరిగే దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ దళిత నాయకులు, క్రిష్టియన్ మైనార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, క్రిష్టియన్లు, మైనార్టీలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్‌ను హత్య చేశారని, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో దళితులను గ్రామ బహిష్కరణ చేశారన్నారు. ఇలాంటి అన్యాయాలు, అక్రమాలను వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు ఎత్తిచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బూసిపాటి కిశోర్, పులి సునీల్, సీహెచ్ వినోద్, త్యాగరాజు, సుబ్బరాయుడు, పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

## చీనీకాయల మార్కెట్‌లో గొడవ

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న చీనీకాయల మార్కెట్‌లో బుధవారం మండి యజమానులు, రైతులు, వ్యాపారస్తుల మధ్య గొడవ జరిగింది. బండి యజమానులు కుమ్మక్కై వ్యాపారస్తులు వేలంపాట పాడనివ్వకుండా చేయడంతో రైతులు, వ్యాపారస్తులు, మండి యజమానులతో గొడవకు దిగారు. మండి యజమానులు అంతా సిండికేట్ అయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం వల్ల ఈ వాగ్వాదం చోటు చేసుకున్నట్లు అక్కడున్న వ్యాపారస్తులు, రైతులు తెలిపారు.




### ఘనంగా చందనాజ్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

ప్రొద్దుటూరు : పట్టణంలోని గాంధీ రోడ్డులో నూతనంగా చందనా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చందనాజ్ జ్యువెలరీ షోరూంను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం ప్రతినిధులు మాట్లాడుతూ తమ షోరూంలో లైఫ్ టైం వారంటీతో హాల్ మార్క్ బంగారు ఆభరణాలు లభిస్తాయని తెలిపారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ఒక గ్రాము గోల్డ్ కొన్న వారికి రెండు గ్రాముల వెండిని ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈనెల 25వ తేదీ వరకు కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అదుపు తప్పి లారీ బోల్తా



రహదారి పక్కన బోల్తా పడిన లారీ

ముద్దనూరు : ముద్దనూరు– తాడిపత్రి జాతీయ రహదారిలో యామవరం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం లారీ బోల్తా పడింది. తాడిపత్రి వైపు ప్రయాణిస్తున్న లారీ వేగం అదుపు తప్పడంతో రహదారి పక్కన బోల్తా పడింది. అయితే ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

### సైన్స్ ఒలంపియాడ్‌లో భారతి డీఏవీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న, గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కిషోర్ కుమార్

కమలాపురం : సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పోటీల్లో డీఏవీ భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) భారతి డీఏవీ పాఠశాలలో బుధవారం సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో జోనల్ స్థాయిలో 41 మంది బంగారు పతకాలు సాధించారు. అలాగే 6 మంది రజత పతకం, 8 మంది వెండి పతకాలు సాధించారని ఆయన తెలిపారు. కాగా హెచ్‌ఆర్ హెడ్ గోపాల్ రెడ్డి, డీఏవీ రీజనల్ ఆఫీసర్ శేషాద్రి ఒలంపియాడ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### మూలపల్లెలో చిరుతల సంచారం

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామ సమీపంలో చిరుత పులులు సంచరిస్తుండటంతో గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కడప రేంజి పరిధిలోని కనుమలోపల్లె బీటులో చిరుత పులి, చిరుత కూనలు సంచరిస్తుండటంతో గ్రామ ప్రజలు, చుట్టు పక్కల పొలాల రైతులకు కంటినిండా నిద్ర లేకుండా పోయింది. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన రాజశేఖర్‌యాదవ్ అనే వ్యక్తి తన మేక కనిపించకపోవడంతో గాలింపు చేపట్టగా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో మేక మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు. మంగళవారం రాత్రి చిరుత పులి, రెండు చిరుత కూనలు మూలపల్లె–సిద్దవటం రోడ్డులో సంచరిస్తూ గ్రామ సమీపంలోని పొట్టేటి పద్మావతమ్మ మామిడి తోటలోకి వెళుతుండగా మాచుపల్లె నుంచి బొలెరోలో వస్తున్న హెచ్‌పీసీఎల్ గ్యాస్ కంపెనీ లైన్ వాకర్లు బి. యల్లయ్య, విష్ణులకు కనిపించాయి. దీంతో వారు మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న కడప రేంజర్ ప్రసాద్ సిబ్బందితో కలిసి చిరుత పాద ముద్రలను గుర్తించేందుకు చిరుత పులి సంచరించిన ప్రాంతాల్లో పరిశీలించారు.

## అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



పులివెందుల రూరల్ : అసాంఘిక కార్యక్రమాలైన క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూదం లాంటి వాటిని ఎదుర్కొనేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పులివెందుల పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లను గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. పలు నియోజకవర్గాలలో సీసీ టీవీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే డ్రోన్ కెమెరాల ద్వారా బందోబస్తు నిర్వహిస్తామన్నారు. అలాగే సరిహద్దు ప్రాంతాలలో జూదమాడుతున్నట్లు సమాచారం వస్తోందనానరు. దాన్ని అరికట్టేందుకు కూడా ప్రత్యేక పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఫ్యాక్షన్ గ్రామాల్లో ఆధిపత్య పోరువల్ల గొడవలు జరగకుండా గట్టి నిఘా ఉంచుతామన్నారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మిస్సింగ్ కేసులు, వాహనాల దొంగతనాలు, చైన్ స్నాచింగ్ లాంటి సంఘటనలు జరగకుండా పోలీసులతో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పులివెందుల ప్రాంతంలోని సీఐలు, ఎస్ఐలతో ఆయన పలు విషయాలపై చర్చించారు.

**పోలీస్ భవనాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ**

లింగాల : మండల కేంద్రమైన లింగాల పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి స్టేషన్‌లోని సిబ్బందిని మండల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతిభద్రతలు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ ఆవరణంలో నూతనంగా నిర్మించిన పోలీస్ భవనాన్ని పరిశీలించారు. నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను ఎస్ఐ మధుసూదనరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**శాంతిభద్రతలు పరిరక్షించాలి**

చక్రాయపేట : మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీసులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన చక్రాయపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్ఐ కృష్ణయ్యలకు పలు సూచనలు ఇచ్చారు. ఇదే సందర్భంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రంతుబాషా, అధ్యాపకుడు గంగయ్యలు స్టేషన్ వద్ద ఉన్న ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు.

**పోలీసు స్టేషన్ల తనిఖీ**

వేంపల్లె : ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్, వేంపల్లె పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పోలీసును ఏర్పాటు చేసి అల్లర్లు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళి నాయక్, సీఐలు నరసింహులు, ఉలసయ్య, ఎస్ఐలు రంగారావు, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**వేములలో**

వేముల : మండల కేంద్రమైన వేముల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌కు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

# దేవుడి సొమ్మును దోచుకు తింటున్నారు



శ్రీకృష్ణ గీతాశ్రమంలో మలయాళ స్వామి బీఈడీ కళాశాల మూడంతస్తుల భవనం

ప్రొద్దుటూరు : లోకకల్యాణార్థం పూర్వం నామా ఎరుకలయ్య శ్రీ కృష్ణ గీతాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. 1946 సంవత్సరంలో తన స్థిర, చరాస్తులన్నింటిని శ్రీ కృష్ణ గీతాశ్రమానికి చెందేట్లుగా రిజిస్టర్ చేయించారు. సర్వే నంబర్ 383లో మొత్తం 4.30 ఎకరాల విస్తీర్ణంలో భవనాలను నిర్మించడంతోపాటు మైదానాన్ని ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో ఈ ఆశ్రమానికి సంబంధించిన భూములు ఉండగా అధికారులు కౌలుకు ఇచ్చారు. జీపీఏ ద్వారా గతంలో గంగాధరానంద గిరి స్వామి ఈ ఆశ్రమాన్ని నిర్వహించే వారు. 2020లో కరోనాతో ఆయన మరణించారు.

**పట్టించుకోని అధికారులు**

ఆశ్రమ నిర్వాహకుడు గంగాధరానంద గిరి స్వామి తర్వాత కాలంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మలయాళ స్వామి బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందులో మాజీ మున్సిపల్ చైర్మన్ నరాల బాలిరెడ్డి, డాక్టర్ చెన్నకేశవరెడ్డి లాంటి ప్రముఖులతోపాటు గంగాధరానంద గిరిస్వామి బంధువు భాస్కర్‌రెడ్డి సభ్యులుగా ఉండేవారు. 2014లో భాస్కర్‌రెడ్డికి, గంగాధరానంద గిరి స్వామికి వివాదం ఏర్పడటంతో కమిటీ నుంచి భాస్కర్‌రెడ్డిని తొలగించారు. గంగాధరానంద గిరి స్వామి మరణానంతరం భాస్కర్‌రెడ్డి తాను కూడా బీఈడీ కళాశాలలో సభ్యుడిగా ఉన్నానని చెప్పడంతోపాటు కళాశాల భవనాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అడ్డు చెప్పే అధికారులు లేకపోవడంతో మూడు అంతస్తుల కళాశాల భవనం ఆయన స్వాధీనంలో ఉండేది. రెండేళ్ల క్రితం భాస్కర్‌రెడ్డి దంపతులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. భాస్కర్ రెడ్డి మరణం తర్వాత మరికొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలను సృష్టించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బీఈడీ కళాశాలకు అనుమతి ఇవ్వాలని కోరడంతో హైకోర్టు 2024 ఏప్రిల్ 23న స్టే మంజూరు చేసింది. మూడంతస్తుల భవనానికి ఏడాదికి కేవలం రూ.4వేలు అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం. తక్కువ అద్దెకు భవనాన్ని స్వాధీనం చేసుకున్న వ్యక్తులు కోచింగ్ సెంటర్లు, స్పోకెన్ ఇంగ్లీషు సెంటర్ నిర్వహించేందుకు అద్దెకు ఇచ్చి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న దేవాదాయశాఖ అధికారులు బహిరంగంగా ఇవన్నీ చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. ప్రత్యేకంగా ప్రభుత్వం విచారణ అధికారులను నియమిస్తే శ్రీకృష్ణ గీతాశ్రమంలోని అక్రమాలన్నీ వెలుగు చూసే అవకాశం ఉంది.